క్లుప్తంగా

ఘనంగా మహాపడి పూజోత్సవం

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన సగ్గం రాజు గురుస్వామి ఆధ్వర్యంలో తన నివాసంలో శుక్రవారం మహాపడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు తరలివచ్చి పడిపూజలో పాల్గొన్నారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు

కుంటాలలో 4న..

కుంటాల: మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో ఈనెల 4న సోమవారం అయ్యప్ప మహా పడిపూజను గురుస్వామి సిర్యాక్ రాజేశ్వర్ నారికేళ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కుంటాల అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నవీపేట్ అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు శశాంక్ జోషి ఆధ్వర్యంలో నిర్వహించే పడిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏబీవీపీ మహాసభలు జయప్రదం చేయాలి



ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఢిల్లీలో ఈనెల 7 నుంచి 10వ తేదీల్లో నిర్వహించే 69వ ఏబీవీపీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని నిర్మల్ జిల్లా కన్వీనర్ కైరి శశి పిలుపునిచ్చారు. ఏబీవీపీ ఇందూర్ శాఖ ఆధ్వర్యంలో దీక్ష జూనియర్ కళాశాలలో మహాసభల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కై రి శశి మాట్లాడుతూ మహాసభల్లో విద్యారంగ సమస్యలు, పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఏబీవీపీ ప్రారంభమై 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా పదివేల మందికి ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. ముఖ్యఅతిథిగా ప్రధాని మోదీ హాజరవుతారని తెలిపారు. ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రవణ్, భగవన్, దినేష్, రఘు, సన్ని పాల్గొన్నారు.

'ర్యాలీలకు అనుమతి లేదు'



మాట్లాడుతున్న సీఐ మోహన్

ఖానాపూర్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సందర్భంగా ఆదివారం ర్యాలీలు, వేడుకలకు అనుమతి లేదని ఖానాపూర్ సీఐ మోహన్ అన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్, 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున బాణసంచా పేల్చడం, డీజేలు పెట్టడం, గుంపులుగా తిరగడం, ర్యాలీలు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముథోల్/కడెం/కుంటాల/లక్ష్మణచాంద/సోన్/పెంబి: ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేవని ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి, సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సైలు కొసన రాజు, హన్మాండ్లు, రజనీకాంత్ వేర్వేరుగా ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఊరేగింపునకు అనుమతి వచ్చాకే జరుపుకోవాలని సోన్ సీఐ సూచించారు.

హెచ్ఎమ్మెస్ డివిజన్ కార్యదర్శిగా నవీన్‌కుమార్

మందమర్రిరూరల్: మందమర్రి డివిజన్ హెచ్ఎమ్మెస్ కార్యదర్శిగా శాంతిఖనిలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వర్తించే నవీన్‌కుమార్‌ను నియమిస్తూ హెచ్ఎమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. తనకు పదవి ఇచ్చినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పనిసరిగా మెనూ పాటించాలి

కెరమెరి: మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మెనూ పాటించాలని కెరమెరి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని సుల్తాన్‌గూడ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని పేర్కొన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

రెబ్బెన: కాగజ్‌నగర్‌కు చెందిన దుర్గా సునీల్ అనే యువకుడు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చంద్రశేఖర్ బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దుర్గా సునీల్ సెల్‌ఫోన్ పోగొట్టుకొని ఫిర్యాదు చేయగా కోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశామన్నారు.

బోథ్ గడ్డ.. ఎవరి అడ్డా

- నేడు ఓట్ల లెక్కింపు
- అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ
- పది మందిలో గెలుపెవరిదో!
- గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

బోథ్ గడ్డ ఎవరి అడ్డాకానుందో నేడు తేలనుంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఓ ట్ల కౌంటింగ్ జరగనుంది. దీంతో ఆయా పార్టీల అ భ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఓటింగ్ సరళి ను వ్వా.. నేనా అన్నట్లు సాగినట్లు తెలుస్తోంది. తమదే గెలుపని ఆయా పార్టీల అభ్యర్థులు చెబు తున్నా.. ఎన్నికల ఫలితంపై వారిలో ఉత్కంఠ నెలకొంది. – బోథ్



ఓటేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

పోలైన ఓట్ల వివరాలు..

నియోజకవర్గంలో మొత్తం 2,08,048 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,01,281, మహిళలు 1,06,764 ఉన్నారు. మొత్తం 1,72,397 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 85028, మహిళలు 87369లు ఓటు వేశారు. అయితే ఈసారి మహిళలు పురుషుల కన్నా తక్కువగా ఓటు వేశారు. పురుషులు 83.95 శాతం, మహిళలు 81.83 శాతం ఓటువేశారు.

22 రౌండ్లలో లెక్కింపు..

బోథ్ నియోజకవర్గంలో 302 పోలింగ్ కేంద్రాల ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. బోథ్ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లలో 22 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. ప్రతీ 15 నిమిషాలకు ఒక రౌండ్ పూర్తి కానుంది. ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు జరగనుంది. మధ్యాహ్నం 3 గంటల్లోపు బోథ్ నియోజకవర్గం ఫలితం వచ్చే అవకాశం ఉంది.

బోథ్ బరిలో ఉన్న అభ్యర్థులు..

బోథ్ నియోజకవర్గంలో మొత్తం 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అనిల్ జాదవ్ (బీఆర్ఎస్), సోయం బాపూరావ్ (బీజేపీ), ఆడె గజేందర్(కాంగ్రెస్), మెస్రం జంగుబాపు (బీఎస్పీ), ఉయికె ఉమేష్ (డీఎస్పీ), ఆడె సునీల్ (భారత చైతన్య పార్టీ), బాదు నైతం (గోండ్వానా గణతంత్ర పార్టీ), ఉహికె హీరాజీ (రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ) తొడసం ధనలక్ష్మి (స్వతంత్ర), జాదవ్ భోజ్యా నాయక్ (స్వతంత్ర)లుగా బరిలో ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తాంసి: దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భీంపూర్ ఆరోగ్య విస్తీర్ణాధికారి లింగంపెల్లి జ్ఞానేశ్వర్ సూచించారు. శనివారం భీంపూర్ మండలంలోని జల్‌కోరి, అందర్‌బంద్ గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గంగాధర్, ఏఎన్ఎం సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సర్ఫారాజ్

పాఠశాలలో వైద్యశిబిరం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మామడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం వైద్య శిబిరం న నిర్వహించారు. 106 మంది బాలికలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి సర్ఫరాజ్ తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బొమ్మెత సుభాష్, ఆరోగ్య సహాయకులు పవర్ ప్రేంసింగ్, ఆశలు రుక్మిణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ పాల్గొన్నారు.

పరామర్శ



కార్యకర్తను పరామర్శిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కిందపడి చేయి విరిగి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుంర్ర నాని అనే కార్యకర్తను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రవి, తదితరులున్నారు.

అన్నదానం



వడ్డిస్తున్న దేవేందర్ యాదవ్ దంపతులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని దేవరకోట దేవస్థానం శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఈసపోయిన రిషిత–దేవేందర్ యాదవ్ దంపతులు తమ కూతురు జన్మదినం సందర్భంగా అయ్యప్ప స్వాములు, 1500 మంది భక్తులకు అన్నదానం చేశారు. అంతకుముందు ఆలయంలో వైభవంగా పల్లకీసేవ, స్వామివారికి పంచామృత అభిషేకాలు చేపట్టారు. ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, కౌన్సిలర్లు నరేందర్, ఎస్పీ రాజు, మేడారం అపర్ణ, జగడం రాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆదిలాబాద్‌రూరల్: బాలికలకు, మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి అన్నారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా శనివారం మావల మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించారు. ఈనెల 10న నిర్వహించనున్న మానవ హక్కుల దినోత్సవం వరకు స్త్రీలకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా.. మహిళలపై, చిన్నారులపై హింసలు ఆగడం లేదన్నారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం సిబ్బంది లావణ్య, పాఠశాల ప్రిన్సిపాల్ రేవరల్ టామి, జీన్స్ థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సఖీ సిబ్బంది

ధాన్యం తూకంలో కోతలు సరికాదు

ఖానాపూర్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అధికారులు ఇష్టారాజ్యంగా కోతలు విధించడం సరికాదని ప్రజాసంఘాల పోరాట కన్వీనర్ నూతన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం రైతులతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 కిలోల బస్తా బరువు పేరిట కిలో కోత విధించడంతోపాటు అదనంగా మరో కిలో కోత విధించడం సరికాదన్నారు. అధికారులు తీరు మార్చుకోవాలని లేకపోతే లేకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు నర్సయ్య, శంభు, నారాయణ తదితరులు ఉన్నారు.



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నాయకులు

ప్రమాదాలు జరగకముందే పట్టించుకోండి



భీమిని: పత్తిలోడ్ ట్రాక్టర్లు రాత్రి వేళల్లో వెళ్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. భీమిని, కన్నెపల్లి మండలాల్లో సేకరించిన పత్తిని ఇంటికి తరలించేందుకు ట్రాక్టర్ ట్రాలీని డోర్లు తీసి వెడల్పుగా అమర్చి అందులో పత్తి బస్తాలు వేసి దాని పై కూలీలు కూర్చొని ప్రమాదకరంగా ప్రయా ణం చేస్తున్నారు. రాత్రి వేళల్లో లోడ్‌తో వచ్చే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలు గమనించ క ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతేడాది పోలంపల్లి శివారులో పత్తి లోడ్ ట్రాక్టర్‌కు ఆటో ఢీ కొనడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. అలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు దష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

నిరుపేద యువతి వివాహానికి చేయూత

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన నిరుపేద యువతి వివాహానికి మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు చేయూతనిచ్చారు. కాలనీలోని అల్లెపు నర్సవ్వ–వెంకటి దంపతుల కూతురు నర్సవ్వ వివాహానికి పసుపు, కుంకుమతోపాటు రూ.7 వేల విలువైన పుస్తెమెట్టెలను శనివారం అందజేశారు. నాయకులు శ్రీనివాస్, భీమన్న, కిషన్, రమేశ్, భీమేశ్, పృథ్వీరాజు, మల్లయ్య ఉన్నారు.



పుస్తెమెట్టెలు అందజేస్తున్న కృష్ణంరాజు

పీఆర్‌టీయూ మండల కమిటీ ఏర్పాటు

భీమారం: పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ సంఘం (తెలంగాణా) మండల కమిటీ అధ్యక్షుడిగా నర్సింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గుడిమల్ల నరేందర్‌తో పాటు కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యవర్గ స మావేశంలో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రధానకార్యదర్శిగా ఆసంతుల రవీందర్ ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రావుల మల్లన్న బోనాలు

దహెగాం: మండల కేంద్రంలోని మల్లన్న ఒర్రె సమీపంలో రావుల మల్లన్న ఆలయం వద్ద ఆదివారం బోనాల పండుగ నిర్వహించనున్నారు. కార్తీక పౌర్ణమి తరువాత వచ్చే తొలి ఆదివారం బోనాల పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. బోనాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. జాతర నిర్వహించనున్నారు. మండల కేంద్రంతో పాటు పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, కన్నెపల్లి తదితర మండలాల నుంచి భారీగా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

సన్మానం



గోదావరిని సన్మానిస్తున్న నాయకులు

నార్నూర్: మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, సరస్వతి దంపతుల కుమార్తె బానోత్ గోదావరి తొలి ప్రయత్నంలోనే కేంద్ర విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. శనివారం వారి స్వగృహంలో గిరిజనేతరుల సంఘం మండలాధ్యక్షుడు షెక్ దాదేఅలీ ఆమెను సన్మానించారు. గోదావరిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన వెంట అన్నాభావుసాతే కమిటీ మండలాధ్యక్షుడు కొల్రెళ్ల మహేందర్, తదితరులు ఉన్నారు.

రయ్.. రయ్..

- బైక్‌లపై కుర్రాళ్ల మోజు
- స్పోర్ట్స్ బైక్‌లకు పెరుగుతున్న క్రేజ్
- వేగం ముందు రేట్లు బలాదూర్

ఆదిలాబాద్: యూత్ అంటేనే వేగం.. యవ్వనంలోకి అడుగుపెట్టగానే వారి ఆలోచనల్లో సైతం వేగం పెరుగుతోంది. ముఖ్యంగా యూత్ ట్రెండీగా ఉండడానికి ప్రయత్నిస్తుంటారు. వారి వయసుకు తగ్గట్టు హోదా గౌరవాన్ని పొందేందుకు కొత్త కొత్త ఫీట్లు చేస్తుంటారు. వారి హోదాకు చిహ్నంగా బైక్‌లను రయ్.. రయ్ మంటూ నడుతారు. కుర్రకారు అభిరుచులకు అనుగుణంగా కంపెనీలు సైతం వివిధ మోడల్‌సను మార్కెట్లోకి వదులుతూ ఆకట్టుకుంటున్నాయి. యువత ముఖ్యంగా స్పోర్ట్స్ బైక్‌లపై మనసు పారేసుకుంటున్నారు.

స్పీడ్ కే ఓటు..

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కంపెనీలు పలు సౌకర్యాలు, ఆకట్టుకునే మోడల్స్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. హై పవర్ సీసీ ఇంజన్, వినుసొంపైన హారన్, ఆకట్టుకునే డూమ్ ఇలా పలు ఫీచర్లను చూసి యువత కొనుగోలు చేస్తున్నారు. బైక్ స్పీడ్ ఏ రేంజ్ లో ఉంది? హుందాగా ఉందా? లేదా? అన్నది చూసి బుక్ చేసుకుంటున్నారు. మైలేజ్ తో సంబంధం లేకుండా బైక్ వేగానికే ఓటు వేస్తున్నారు.



యువకుడి బైక్ రైడింగ్

ఇవే ట్రెండీ బైక్స్..

200 డ్యూక్, ఆర్సీ 200, ఎక్స్ పల్స్ 200, ఎక్స్ ట్రిమ్ 160 ఆర్, ఆవెంజర్స్, బుల్లెట్, అపాచీ, ఆర్ 15ఎస్, ఎస్ఎస్ 200, పల్సర్ 125, 150, ఎన్160, ఎన్ 250, ఎఫ్ జెడ్ఎస్, ఎఫ్ జెడ్ఎక్స్, కరిజ్మా, ఫెజర్, ఎంటీ 15 వంటి మోడళ్లపై యూత్ ఆసక్తి చూపిస్తున్నారు. వీటి ధరలు లక్ష నుంచి రూ. 4 లక్షల వరకూ పలుకుతున్నా.. కొనుగోలుకు వెనుకాడడం లేదు.



అల్లుకున్న సొరతీగ

కుంటాల: మండలంలోని అంబకంటి హనుమాన్ ఆలయం వెళ్లే మార్గంలో రెండు చెట్లను సొరతీగ అల్లుకుంది. రెండు చెట్లపై గొడుగుల్లా అల్లుకున్న దృశ్యాన్ని చూసి ప్రకృతి ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల చుట్టూ మురుగునీరు



నార్నూర్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 250పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల చుట్టూ మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసన భరించలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వడ్డెరా కాలనీలోని మురుగునీరు పాఠశాల చుట్టూ చేరుతోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

అటవీశాఖ సెక్షన్ కార్యాలయం ప్రారంభించేదెప్పుడో?



తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో అటవీశాఖ సెక్షన్ అధికారి కార్యాలయాన్ని నిర్మించారు. దాదాపుగా రూ.30 లక్షల వ్యయంతో నిర్మించారు. నిర్మాణం పూర్తయి ఆరు నెలలు అవుతుంది. ఇప్పటికీ కాంట్రాక్టర్ సంబంధిత అధికారులకు భవనాన్ని అప్పగించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని ప్రారంభించాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.